సాక్షి
జగిత్యాల

ఆదివారం | 24 | డిసెంబర్ | 2023



ధర్మపురిలో ప్రత్యేక పూజలు

కన్నుల పండువగా ముక్కోటి



సారంగాపూర్: శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కొండగట్టు: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



జగిత్యాల రూరల్: లక్ష్మీపూర్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు

ధర్మపురి/జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/మల్లాపూర్/సారంగాపూర్/కొండగట్టు: ముక్కోటి ఏకాదశి వేడుకలను ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఉత్తరద్వారం ద్వారా స్వామివారల దర్శనం కల్పించారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముప్పూరు స్వాములను ఊరేగించారు. ధర్మపురి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామీ హాజరై ఉత్తర ద్వారం దర్శనం చేసుకుంటే సకల సౌభాగ్యాలు కలుగుతాయన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం పూజలు చేశారు. జగిత్యాల పట్టణంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. రకరకాల పుష్పాలతో ప్రత్యేక వేదికను అలంకరించారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట శ్రీవేంకటేశ్వరస్వామి, రూరల్‌మండలం లక్ష్మీపూర్ వేంకటేశ్వరస్వామి, పొలాసలోని పొలాసేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత దంపతులు పూజలు చేశారు. మల్లాపూర్ మండలం వాల్గొండ శ్రీరామలింగేశ్వర త్రికూటాలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శివలింగంపైకి సూర్యకిరణాలు ప్రసరించడం ఇక్కడి ఆలయం ప్రత్యేకత. అయితే వాతావరణ మార్పులతో సూర్యకిరణాలు రాకపోవడంతో భక్తులు నిరాశచెందారు.



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీలకు స్వామివార్ల ఫొటోను బహూకరిస్తున్న ఈవో



మల్లాపూర్: వాల్గొండ శ్రీరామలింగేశ్వర ఆలయంలో పూజలందుకున్న ఉత్సవ విగ్రహాలు

వయసు చిన్న.. ప్రతిభ మిన్న

చిన్న వయసులో ఒకరు క్రికెట్‌లో రాణిస్తుంటే.. మరొకరు కథలు రాస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంట్లో కుటుంబసభ్యులూ ప్రోత్సహించడంతో తమ ప్రతిభకు పదును పెడుతూ ఇష్టమైన రంగాల్లో రాణిస్తున్నారు. రాజన్నసిరిసిల్లకు చెందిన అవనీశ్‌రావు అండర్–19 వరల్డ్ కప్‌కు భారత జట్టులో చోటు సంపాదించాడు. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడనున్నాడు. కరీంనగర్‌కు చెందిన బాలుడు స్నితిక్ ఆరోతరగతికి వచ్చేసరికే 12 కథలు రాశాడు. వాటికి పుస్తక రూపం తీసుకొచ్చాడు.



కప్‌తో అవనీశ్‌రావు

– కరీంనగర్ అర్బన్/ముస్తాబాద్



- 8లో ▶



స్నితిక్

న్యూస్‌రీల్

నృసింహుడి కృపతో రాష్ట్రం సుభిక్షం



ముక్కోటి వేడుకల్లో మాట్లాడుతున్న అడ్లూరి

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీనృసింహుడి కృపతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉంటున్నారని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆలయంలో శనివారం జరిగిన ముక్కోటి వేడుకల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌తో కలిసి పాల్గొన్నారు. వేదాలకు నిలయమైన ధర్మపురిలో నారసింహుడు కొలువై ఉన్నారని, ఆయన దయతో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

గల్ఫ్ ప్రతినిధులతో సమావేశానికి వినతి



సమావేశమైన గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ నాయకులు

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం త్వరగా చర్యలు చేపట్టాలని టీపీసీసీ గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ కోరింది. ఈ మేరకు కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్ బృందం శనివారం హైదరాబాద్‌లోని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ చైర్మన్ వినోద్‌కుమార్‌ను కలిసి చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, గల్ఫ్ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మంద భీంరెడ్డి, స్వదేశీ పరికిపండ్ల, బైర దేవ్ యాదవ్, తేలు బాషా, మాదం వినోద్, రంజిత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో క్షయ నియంత్రణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో

సారంగాపూర్: మంచి ఆహారం.. మందులు తీసుకుంటే క్షయను తగ్గించవచ్చని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నాయికపుగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా నిర్వహించిన వైద్యశిబిరంలో మాట్లాడారు. క్షయ, బీపీ, మధుమేహం, తదితర పరీక్షలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాణిమైత్రీరెడ్డి, అధికారులు, సర్పంచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆదాయం తక్కువ.. వ్యయం ఎక్కువ

- ఆర్నెళ్లుగా నిలిచిన పట్టణప్రగతి నిధులు
- నూతన మాస్టర్ ప్లాన్ అమలయ్యేనా..
- భవన నిర్మాణంలో కౌన్సిలర్ల చేతివాటం
- ఇబ్బందులు పడుతున్న గృహ యజమానులు

రాయికల్: రాయికల్ మున్సిపాలిటీకి ఆదాయం తక్కువ.. వ్యయం ఎక్కువ అన్నట్లు మారింది. ఖజానా ఖాళీ అయి అప్పుల్లో కూరుకుపోయింది. ఆర్నెళ్లుగా మున్సిపాలిటీకి పట్టణ ప్రగతి నిధులు రాకపోవడంతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదు. దీంతో అధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

రాయికల్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి 2018లో ఆగస్టు 2న మున్సిపాలిటీగా మారింది. ఇక్కడ 12వార్డులు ఉన్నాయి. ఔట్‌సోర్సింగ్ కింద 33 మందిని నియమించారు. వీరిలో 21మంది పారిశుధ్య కార్మికులు, మిగిలిన 12 మంది మున్సిపల్ సిబ్బందిగా పనిచేస్తున్నారు. అదనంగా 21 మంది కార్మికులను శానిటేషన్, హరితహారం పథకం కింద తీసుకుని రోజువారీగా ఒక్కొక్కరికి రూ.400 చొప్పున పట్టణ ప్రగతి నిధుల నుంచి అందిస్తున్నారు. బల్దియాలో చెత్తసేకరణకు ఆరు ఆటోలు, మూడు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ఈ వాహనాలకు ప్రతినెలా ఇంధనం ఖర్చు రూ.2.50 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఖర్చవుతోంది. పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేవలం రూ.5,87,000 మాత్రమే విడుదలవుతాయి. అవి కూడా గత జూన్ నుంచి మంజూరుకాకపోవడంతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే మార్గాలివే

మున్సిపాలిటీకి ఆస్తిపన్ను, నీటిపన్ను, ట్రేడ్‌లైసెన్స్, భవన నిర్మాణాల కింద ఆదాయం వచ్చే మార్గాలున్నాయి. 5,091 ఇళ్లు ఉండగా ఏటా రూ.1.13 కోట్లు, 1850 నల్లాల ద్వారా రూ.4లక్షలు, ట్రేడ్ లైసెన్స్ కింద 450 షాపులకు రూ.4.50లక్షలు మాత్రమే సమకూరుతాయి.



రాయికల్ మున్సిపాలిటీ

ఇళ్ల నిర్మాణాల్లో కౌన్సిలర్ల చేతివాటం

మున్సిపాలిటీ 2018లో ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు కేవలం డీపీఎంఎస్ కింద 41, టీఎస్‌బీపాస్ కింద 158 మొత్తంగా 199 మాత్రమే భవనాలు నిర్మించినట్లు మున్సిపల్ అధికారుల లెక్కల్లో ఉన్నాయి. వార్డుల్లో భవన నిర్మాణ పనులు చేపడితే ముందుగా గృహ యజమానుల వద్దకు స్థానిక కౌన్సిలర్ వెళ్లి ఇంటి పర్మిషన్ తాము చూసుకుంటామని అందినంతా దండుకుంటున్నారన్న అపవాదు నెలకొంది. ఒక్కో ఇంటికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి మాటలు నమ్మి భవనాలు నిర్మించుకుంటున్న వారికి అనంతరం అధికారులు అధికంగా పన్ను వేస్తున్నారు. ఇదేంటని అడిగితే అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే నిబంధనల ప్రకారం లైఫ్‌టైం పన్ను వసూలు చేయాల్సి వస్తుందని చెబుతుండడంతో ఇళ్ల యజమానులు తలలు పట్టుకుంటున్నారు.

మాస్టర్‌ప్లాన్‌లో జాప్యం

బల్దియాను 10 జోన్లుగా ఏర్పాటు చేశారు. ఇందులో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, పబ్లిక్, సెమీ పబ్లిక్, ట్రాన్స్‌పోర్ట్, కమ్యూనికేషన్, వాటర్‌సోర్స్, గ్రీన్‌బెల్ట్, గ్రేవియార్డ్ సోర్స్, అర్బన్‌స్టెబుల్, అగ్రికల్చర్ జోన్లుగా విభజించారు. ఇందులో గ్రీన్‌బెల్ట్, ఇండస్ట్రియల్ జోన్లలో నూతన మాస్టర్ ప్లాన్ అమలు కాకపోవడంతో గ్రీన్‌బెల్ట్‌లో జన్మయ చెరువు, అయ్యప్ప మందిరం, పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో ఆఫీస్, నాగులకుంట, రామాజీపేట, ఎర్రకుంట, ఇండస్ట్రియల్ జోన్‌లో అయ్యప్ప ఆలయం, గౌరిశంకర్‌రైస్‌మిల్, సహారా బీడీ కంపెనీ వంటి ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలూ చేపట్టరాదని ఆదేశాలు జారీ చేయడంతో నూతన గృహ నిర్మాణాలకు జాప్యం ఎదురవుతోంది. మున్సిపాలిటీని అభివృద్ధి చేసేలా మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించి నూతన మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయాలని, నూతన మాస్టర్‌ప్లాన్ అమలయ్యేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు



మున్సిపాలిటీకి ఆరునెలల నుంచి పట్టణ ప్రగతి నిధులు మంజూరు కాలేదు. లైసెన్స్ ఫీజులు, పన్నులు చెల్లించకపోవడంతో నిధుల కొరత ఉంది. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు కృషి చేస్తున్నాం. మాస్టర్ ప్లాన్ అమలుకు సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లాం. అనుమతి రాగానే అమలు చేస్తాం.

– గంగుల సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్

జగిత్యాల: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్ అన్నారు. శనివారం ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022–23లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి కాసుగంటి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.40 వేల చొప్పున అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబర్చిన వారిని ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఆర్డీవో నర్సింహమూర్తి మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు ట్రస్ట్‌పేరు నిలబెట్టాలన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరాలన్నారు. కృష్ణవేణి, రోహిత్, మానస, అనూష రూ.40వేల చొప్పున అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అశోక్, అధ్యాపకులు కరుణాకర్, ప్రకాశ్, గోవర్ధన్, సందీప్, అశోక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న జడ్జి

ప్రాచీన ఆలయాలను సంరక్షించాలి

- త్రిదండి దేవనాథ రామానుజ జీయర్

రాయికల్: ప్రాచీన ఆలయాల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ అన్నారు. పట్టణంలోని అతి పురాతన చెన్నకేశవనాథ ఆలయాన్ని శనివారం సందర్శించారు. అర్చకులు సతీశ్‌శర్మ, సాయిశర్మ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయాలకు నూతన నిర్మాణాలు చేపడితే వాటి చరిత్ర భవిష్యత్‌తరాలకు తెలుస్తుందన్నారు. యువత ఆచార సంప్రదాయాలు పాటించాలని సూచించారు. భగవంతుని ముందు అందరూ సమానులేనన్నారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి, కోశాధికారి చౌడారపు లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శి నరేశ్, ఆలయ కమిటీ సభ్యులు చింత శివకుమార్, చిన్నజీయర్‌స్వామి శిష్యులు ఎద్దండి ముత్యంరాజు, ఎనగందుల రమేశ్ పాల్గొన్నారు.



చెన్నకేశవనాథ ఆలయంలో జీయర్‌కు స్వాగతం

గోదావరిపై మరో బ్యారేజీ నిర్మిస్తాం

- ఎత్తిపోతల పథకాలను అందుబాటులోకి తెస్తాం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వెల్లడి

సారంగాపూర్: గోదావరిపై మరో బ్యారేజీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బీర్‌పూర్ మండలం రేకులపల్లి, కమ్మునూర్ ఎత్తిపోతల పథకాలు, రేకులపల్లి–కొల్వాయి మధ్య గోదావరి తీరాన్ని శనివారం పరిశీలించారు. గోదావరిపై రేకులపల్లి–కొల్వాయి గ్రామాల మధ్య బ్యారేజీ నిర్మిస్తామన్నారు. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల మిగులు నీరు ఇక్కడ కలుస్తాయన్నారు. దీనిపై నెలరోజుల్లో అంచనాలు రూపొందించాలని నీటిపారుదలశాఖ ఈఈ నారాయణరెడ్డికి సూచించారు.

ఎత్తిపోతలపై సమీక్ష

రేకులపల్లి, మంగేళ, కమ్మునూర్ ఎత్తిపోతల ద్వారా యాసంగి పంటలకు నీరందించాలని జీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. రంగసాగర్, చిత్రవేణి గూడెం, జగన్నాథ్‌పూర్ ఎత్తిపోతల పునరుద్ధరణకు నిధులు విడుదల చేయిస్తానని తెలిపారు. రోల్లవాగులో 0.25 టీఎంసీల నీరు నిలువ ఉంటే చెర్లపల్లి, కండ్లపల్లి, ఇతర గ్రామాల రైతులకు ఇబ్బంది ఉండదని, ఆ మొత్తం నిల్వ చేసుకోవడానికి అటవీశాఖకు అభ్యంతరం ఉండదని, ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడుతానని తెలిపారు. ఎంపీపీ రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ పాల్నాని నవీన్‌రావు ఉన్నారు.



కమ్మునూర్ ఎత్తిపోతలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

జగన్నాథపూర్ అభివృద్ధికి కృషి

రాయికల్: మండలంలోని జగన్నాథపూర్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అన్నారు. గ్రామంలోని చందమామకుంట నింపేందుకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ట్రైబల్ వెల్ఫేర్ నుంచి రైతులకు రాయితీపై మోటార్లు ఇప్పించేలా కృషి చేస్తానన్నారు. ఆదివాసీలకు పక్కా ఇళ్లు నిర్మించేలా చర్యలు చేపడతామన్నారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: ఆన్‌లైన్ కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సమాజమార్పులో భాగంగా వ్యాపారరంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో ఈ కామర్స్ మార్కెటింగ్ అందుబాటులోకి వచ్చిందని, వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 1986లో వినియోగదారుల చట్టం అమలులోకి వచ్చిందని, దాని స్థానంలో ప్రభుత్వం కొత్తగా 2019 వినియోగదారుల చట్టం తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ కొనుగోలు చేయడం సర్వసాధారణమైందని, వినియోగదారుల హక్కులు కాపాడుకునేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా తూనికల కొలతల అధికారి అజీజ్, జిల్లా మేనేజర్ హకీరాం, డెప్యూటీ తహసీల్దార్ రాకేశ్, కన్జుమర్ అవైర్‌నెస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల రాజేంద్రశర్మ, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

యాసంగికి ఆరుతడే దిక్కు!

- మొత్తం ఆయకట్టుకు నీరందించలేమంటున్న అధికారులు
- ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచన
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 8 లక్షల ఎకరాల్లో వరిసాగుపై నీలినీడలు
- వచ్చే నెల ఒకటి నుంచి నీటి విడుదల
- వారబందీ అమలు చేస్తామన్న ఎస్సారెస్పీ ఈఎన్‌సీ శంకర్
- 'కాళేశ్వరం' నుంచి రివర్స్ పంపింగ్ ఆగడమే కారణం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: యాసంగి పంటల విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు బాంబు పేల్చారు. ఈ యాసంగి సీజన్‌కు వరికి పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించలేమని స్పష్టం చేశారు. వరికి బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మధ్యమానేరు డ్యాం(ఎంఎండీ), లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండీ)ల కింద దాదాపు 8 లక్షల ఎకరాల్లో వరి సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఆగిపోయిన రివర్స్ పంపింగ్

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాళేశ్వరం పిల్లర్లు కుంగిన నేపథ్యంలో కొంతకాలంగా రివర్స్ పంపింగ్ ఆగిపోయింది. దీనిపై ఎల్లంపల్లి, మధ్యమానేరు, లోయర్ మానేరు ప్రాజెక్టులు, వాటి అనుబంధంగా ఉన్న చెరువులు నింపేవారు. ఎత్తిపోతలు ఆగిపోవడం, మరమ్మతులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియని పరిస్థితి ఉండటంతో యాసంగి మొత్తానికి నిరంతర సాగు నీరందించడంపై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో అందించకపోతే వరి పంటకు తీవ్రనష్టం వాటిల్లనుంది. ఈ విషయాన్ని ముందే గుర్తించిన ఎస్సారెస్పీ అధికారులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచిస్తున్నారు.

ఆరుతడి పంటలు వేయాలి..


ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు రైతులు ఈ యాసంగిలో ఆరుతడి పంటలే వేసుకోవాలని ఎస్సారెస్పీ ఈఎన్‌సీ శంకర్ తెలిపారు. కరీంనగర్‌లోని ఎల్ఎండీ కాలనీ గెస్ట్‌హౌస్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. యాసంగి పంటలకు వచ్చే నెల 1 నుంచి నీటిని విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. వారబందీ పద్ధతిన మార్చి 31 వరకు మిడ్‌మానేరు, దిగువ మానేరు జలాశయాల నుంచి పంటలకు నీరిస్తామని పేర్కొన్నారు. ఈ రెండు జలాశయాల్లో పంటలకు సరిపడా టీఎంసీల నీరు అందుబాటులో ఉందన్నారు. హుజూరాబాద్ వరకు సాగుచేసే పంటలకే నీరందుతుందని తెలిపారు.

తాగునీటికి ప్రాధాన్యం..

ఈసారి సాగు నీటికంటే.. తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈఎన్‌సీ తెలిపారు. అందుకే పూర్తి ఆయకట్టుకు నీరివ్వడం కుదరడం లేదన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూర్యపేట వరకు నీరివ్వాలని సూచించారని తెలిపారు. అయినా నీటి లభ్యత లేని కారణంగా ఇవ్వలేకపోతున్నామని వెల్లడించారు. బోర్లు, బావులు ఉన్న రైతులు తమకు నచ్చిన పంట వేసుకోవచ్చని, లేనివారు మాత్రం ఆరుతడి పంటలే వేసుకోవాలని సూచించారు.

కాళేశ్వరం నీటిని వాడుకునే పరిస్థితి లేదు

కాళేశ్వరం ఏడో పిల్లర్ కుంగిన కారణంగా, ప్రాజెక్టు నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఈఎన్‌సీ అన్నారు. దీంతో నీటి లభ్యత తగ్గిందని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతులు మొదలయ్యాయని, ఎప్పటిలోగా పూర్తవుతాయో చెప్పలేమని పేర్కొన్నారు. ఈ యాసంగికి మాత్రం నీరు వాడుకునే పరిస్థితి లేదన్నారు. రైతుల సహకరించాలని కోరారు.



ఎల్ఎండీ నుంచి దిగువకు వెళ్తున్న నీరు(ఫైల్)

ప్రాజెక్టు	సామర్థ్యం	ప్రస్తుతం (టీఎంసీలు)	ఆయకట్టు	వరి (ఎకరాల్లో అంచనా)
ఎల్లంపల్లి	20.17	15.50	2,24,000	1,56,800
ఎంఎండీ	27.5	22.22	54,000	40,000
ఎల్ఎండీ	24,03	19.60	9,00,000	6,00,000

క్లుప్తంగా

ప్రిన్సిపాల్ కొట్టాడని మాత్రలు మింగిన విద్యార్థినులు

- జగిత్యాల జిల్లా తాటిపల్లి గురుకులంలో ఘటన
- తల్లిదండ్రుల ఆందోళనతో ఆలస్యంగా వెలుగులోకి

మల్యాల: ప్రిన్సిపాల్ కొట్టాడని విద్యార్థినులు జ్వరం మాత్రలు మింగిన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గురుకులంలో ఆలస్యంగా వెలుగుచూసింది. విద్యార్థుల తల్లిదండ్రుల కథనం ప్రకారం.. తాటిపల్లి బాలికల గురుకులంలో చదువుతున్న నలుగురు బాలికలు ఐదు రోజుల క్రితం అర్ధరాత్రి ఫోన్‌లో బాయ్స్‌తో మాట్లాడుతున్నారని తోటి విద్యార్థినులు ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రిన్సిపాల్ వారిని బెదిరించి, కొట్టారని అదేరోజు రాత్రి విద్యార్థినులు జ్వరం మాత్రలు మింగారు. వారికి కాస్త నలతగా ఉండడంతో తల్లిదండ్రుల వద్దకు పంపించారు. వారు శుక్రవారం గురుకులానికి చేరుకున్నారు. అయితే ఓ విద్యార్థినిని ఆస్పత్రికి వెళ్లి స్కానింగ్ చేసుకొని రావాలంటూ చెప్పినా వినలేదంటూ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కొట్టాడని సదరు విద్యార్థిని తల్లిదండ్రులకు తెలిపింది. వారు గురుకులానికి చేరుకుని తమ కూతురును ఎందుకు కొట్టారంటూ పిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. ప్రిన్సిపాల్ కొట్టడంతోనే విద్యార్థినులు మాత్రలు మింగారంటూ ఆందోళన చేశారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా సోషల్ మీడియా ఉపయోగిస్తున్నారనే, పిల్లల భవిష్యత్ కోసమే బెదిరించానని, తల్లిదండ్రులకు పిలిపించి వివరించానని పేర్కొన్నారు.

పాఠశాల విద్యార్థుల ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన ఆటో

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ బీ-టైపు గేట్ రాజీవ్ రహదారి సర్వీసు రోడ్డుపై శనివారం స్కూల్ ఆటోబోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. గోదావరిఖని నుంచి ముగ్గురు విద్యార్థులను తీసుకుని ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయానికి వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయని, డ్రైవర్, మరో విద్యార్థి సురక్షితంగా బయటపడ్డారని స్థానికులు తెలిపారు. గాయపడిన వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆటో డ్రైవర్ జగన్, విద్యార్థులు సాయి విష్ణు, శివసాయి, సహస్ర ఆటోలో ఉన్నారు.

వయసు చిన్న.. ప్రతిభ మిన్న

- అండర్-19 భారత జట్టుకు, ఐపీఎల్‌కు ఎంపిక
- సౌతాఫ్రికా, ఇంగ్లండ్ ట్రైసిరీస్‌లో ఆడుతున్న అవనీష్‌రావు
- కథలు రాసిన ఆరో తరగతి విద్యార్థి స్మితిక్
- 'ది 12 పెరల్స్'గా పుస్తకానికి రూపకల్పన
- ముందుమాట రాసిన మాజీ కలెక్టర్ కర్ణన్



అవనీష్‌రావు



తల్లిదండ్రులతో అవనీష్‌రావు

పోతుగల్ టు ఐపీఎల్



పోతుగల్ వ్యూ..

ముస్తాబాద్(సిరిసిల్ల): క్రికెట్ అండర్-19 ప్రపంచ కప్‌కు ఎంపికై, సంచలనం సృష్టించాడు 18 ఏళ్ల ఎరవెల్లి అవనీష్‌రావు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన అతన్ని దుబాయ్‌లో మంగళవారం జరిగిన ఐపీఎల్‌ఆటగాళ్ల వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు రూ.20 లక్షలకు దక్కించుకుంది.

తొమ్మిదేళ్ల వయసులో ఆట ప్రారంభం


వికెట్ కీపర్‌గా, లెఫ్టహ్యాండ్ బ్యాటర్‌గా రాణిస్తున్న అవనీష్‌రావు నెల రోజుల వ్యవధిలో ఆసియా కప్, ఇండియా, సౌతాఫ్రికా, ఇంగ్లండ్ ట్రైసిరీస్‌తోపాటు జనవరి 19 నుంచి జరగనున్న అండర్-19 వరల్డ్ కప్‌కు భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇప్పుడు ఐపీఎల్‌లో పెద్ద జట్టుగా పేరుగాంచిన చెన్నై సూపర్ కింగ్స్ అతన్ని తీసుకుంది. పోతుగల్‌కు చెందిన ఎరవెల్లి బాలకిషన్‌రావు సబ్‌రిజిస్ట్రార్‌గా రిటైరయ్యారు. ఆయన కుమారుడు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ లక్ష్మణ్‌రావు-సుష్మ దంపతుల కుమారుడు అవనీష్‌రావు బాల్యం హైదరాబాద్‌లోనే గడిచింది. ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తన తొమ్మిదేళ్ల వయసులోనే క్రికెట్ ఆడటం ప్రారంభించగా తండ్రి ప్రోత్సహించారు. నిత్యం జింఖానా మైదానంలో 10 గంటలకు పైగా ప్రాక్టీస్ చేసేవాడు. పాఠశాల చదువు సమయంలోనే అవనీష్‌రావు హైదరాబాద్ అండర్-14, 16కు ఎంపికయ్యాడు. హెచ్‌సీఏ సైతం అతని ప్రతిభ చూసి, చాలెంజర్స్ ట్రోఫీకి ఎంపిక చేసింది. బీసీసీఐ దృష్టిలో పడగా, అండర్-19 భారత జట్టుకు ఎంపిక చేసింది. తక్కువ వయసులో క్రికెట్‌లో రాణిస్తున్న అవనీష్‌రావు రాష్ట్ర యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఆడమ్ గిల్‌క్రిస్ట్ స్ఫూర్తి..

చిన్నప్పటి నుంచి తనకు ఆడమ్ గిల్‌క్రిస్ట్ అంటే ఇష్టమని అవనీష్‌రావు తెలిపాడు. ఎడమ చేతివాటంతో ఆయన ఎంత ఫేమస్ అయ్యారో.. తాను కూడా అలా కావాలనుకున్నానని అన్నాడు. తాను మొదట హైదరాబాద్‌లోని హిందూ మహావిద్యాలయలో చేరి, కోచ్ చందు ఆధ్వర్యంలో ఆటపై పట్టు సాధించానని పేర్కొన్నాడు. అనంతరం భారత మాజీ క్రికెటర్, ఇండియా ఫీల్డింగ్ కోచ్ ఆర్.శ్రీధర్ అకాడమీలో చేరి, మరింత రాటుదేలినట్లు తెలిపాడు. పలు టోర్నమెంట్లలో మంచి అవకాశాలు వచ్చాయని, అండర్-19 వరల్డ్ కప్‌కు ఎంపికవ్వాలనే లక్ష్యంతో నిత్యం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాక్టీస్ చేశానన్నాడు. తన లక్ష్యం భారత సీనియర్ జట్టుకు ఎంపిక కావడమేనని పేర్కొన్నాడు.



స్మితిక్ తల్లిదండ్రులు



ది 12 పెరల్స్ బుక్

'12 ఏళ్లు'.. 12 కథలు

కరీంనగర్ అర్బన్: కఠిన పదాలను సరిగా ఉచ్చరించలేని వయసు.. పుస్తకాల బ్యాగుతో కుస్తీ పట్టే బాల్యం.. సమయం దొరికితే ఫోన్ గేమ్‌లు, టీవీలకు అతుక్కుపోవాల్సింది.. కానీ, 12 ఏళ్ల వయసులో రచయితగా రాణించడమంటే ఆశ్చర్యమే. వర్ధమాన రచయితలు కరువవుతుండగా స్మితిక్ ఆలోచన విభిన్నం. పుస్తకాలకు కాలం చెల్లిన డిజిటల్ యుగంలో తనకంటూ ప్రత్యేకత చాటుతున్నాడు ఈ బాలుడు. తల్లిదండ్రులు డాక్టర్లయినా తను మాత్రం కలంతో రచనలు చేస్తూ అబ్బురపరుస్తున్నాడు. ఆంగ్లంలో 12 కథలు రాసి, వాటికి పుస్తక రూపం తీసుకువచ్చి, 'ది 12 పెరల్స్'గా నామకరణం చేశాడు.

అమ్మమ్మ ప్రోత్సాహంతో..

కరీంనగర్‌లోని భగత్‌నగర్‌కు చెందిన వైద్య దంపతులు సాయిని నరేందర్-విద్యశ్రీలకు ఇద్దరు కుమారులు. స్మితిక్ పటేల్, అదిత్ పటేల్. స్మితిక్ స్థానిక అద్వైత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. అతనికి కథలంటే మక్కువ. అమ్మమ్మ పత్తెం వసంత ఉపాధ్యాయురాలు కాగా, ఆమె రచనలు, కవితలు చదివేవాడు. తానూ కథలు రాయాలనుకున్నాడు. అమ్మమ్మ ప్రోత్సహించడం, అమ్మానాన్న అతని ఇష్టానికే మొగ్గుచూపడంతో కథలు రాశాడు.

ఒక్కో కథలో ఒక్కో అంశం..



గత కలెక్టర్‌తో స్మితిక్

ది 12 పెరల్స్ పుస్తకాన్ని తల్లిదండ్రులకు అంకితం చేసిన స్మితిక్ కిడ్డీ స్టోరీస్ ఉప శీర్షికగా చేర్చాడు. ఒక్కో కథను ఒక్కో భావజాలంతో రాయగా చదివేవారిని ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. గత కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఈ పుస్తకాన్ని చదివి, ఆయనే దీనికి ముందుమాట రాసి, వర్ధమాన రచయితగా బాలుడిని అభివర్ణించారు. ది ఆర్చర్, సాల్ట్ ఇష్యూ, ది జస్టిస్, అడ్వెంచర్ ఆఫ్ రాంసింగ్, ఎ వారియర్, 3,070, ది డాక్టర్, సాల్ట్ ఇష్యూ-2, ఎ హ్యాండ్‌వర్కింగ్ మదర్స్ లవ్, అవర్ నేచర్, ది మ్యాంగో ట్రీ, ది రైట్‌ఫుల్ కింగ్ అనే కథలను ఆకట్టుకునేలా మలిచాడు స్మితిక్. వీటిలో ఓ విద్యార్థి అవమానాల నడుమ విజేతగా నిలవడంపై ప్రస్తావిస్తూ ఓటమి వెనక విజయం ఉంటుందని చెప్పాడు. ఉప్పులో అక్రమం జరుగుతుందని, ఆరోగ్యం అనారోగ్యానికి గురవుతుందని, నాణ్యమైన ఆహారం కోసం భారత్ ఆలోచిస్తుందని ప్రస్తావించాడు. అన్యాయం, అక్రమాలను ప్రశ్నిస్తూనే సత్యమే గెలుస్తుందని, అత్యాశ పనికి రాదని, ప్రతీ మనిషిలో శక్తి ఉంటుందని ధైర్యం కావాలని చాటాడు. 3,070 సంవత్సరం ఎలా ఉంటుంది, గతమెలా ఉంది, సాంకేతికత తెచ్చిన మార్పును విశ్లేషిస్తూ సాధారణ జీవితమే సంపన్న జీవితమని ఉదహరించాడు. విజయం సాధించేవరకు ప్రయత్నించాలని, తల్లిని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాడు. మొక్కలను రక్షించి, కాలుష్యాన్ని తగ్గించాలని, జీవితంలో త్యాగం ముఖ్యమని, కష్టపడితే ఏదైనా సాధ్యమని పేర్కొన్నాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డీ చొక్కపు వెంకటరమణ స్మితిక్ పటేల్ రచనలు అద్భుతమని కొనియాడారు.

ఆస్తి పంపకాల్లో విభేదాలు

- అన్నపై రోకలి బండతో మోదిన తమ్ముడు
- చికిత్స పొందుతూ మృతి



మృతి చెందిన దాస సురేశ్

గోదావరిఖని: ఆస్తి పంపకాల్లో వచ్చిన విభేదాలు ఓ నిండు ప్రాణాలు తీశాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లెలో నివాసముంటున్న దాస సురేశ్(28)పై రోకలి బండతో దాడిచేయడంతో మృతిచెందాడు. ఆస్తి పంపకాల్లో వచ్చిన విభేదాలతో ఈనెల 18న దాస సురేశ్‌పై అతడి తమ్ముడు దాస నరేశ్(లారీ డ్రైవర్) ఆస్తి విషయంలో పగపెంచుకుని దాడిచేసినట్లు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు వివరించారు. ఈనెల 18న సురేశ్ తలపై రోకలి బండతో దాడిచేయగా పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సీఐ పేర్కొన్నారు. రెండో తమ్ముడు దాస హరీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వివరించారు.

ఢీకొన్న మూడుకార్లు



జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ క్రషర్‌నగర్ రాజీవ్ రహదారిపై శనివారం మూడుకార్లు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. రామగుండం వైపు నుంచి ఎన్టీపీసీ వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారు సడెన్ బ్రేక్ వేయడంతో వెనుకగా వస్తున్న కారు డ్రైవర్ బ్రేక్ వేశాడు. ఆ వెనాకలే వచ్చిన మరో కారు అక్కడే సైతం నిలిచింది. ముందుగా నిలిచిన రెండు కార్లను ఆ వెనకాల వచ్చిన మూడోకారు వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ క్రమంలో మూడు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ఎన్టీపీసీ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

గణితంపై మక్కువ పెంచుకోవాలి

- అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న నరేందర్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలని అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లోగల అల్ఫోర్స్ పాఠశాలలో మ్యాథమెటిక్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి ఎగ్జిబిట్స్ ప్రదర్శించడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందన్నారు. అనంతరం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



యుగంధర్ లాల్

మల్యాల: మండలకేంద్రం క్రాస్‌రోడ్డు వద్ద పానీపూరి బండి వద్ద పనిచేసే బాలుడు యుగేందర్ లాల్(14) అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన యుగేందర్ లాల్ జిల్లాకేంద్రంలోని బంధువుల ఇళ్లలో నివాసముంటూ.. మల్యాల క్రాస్‌రోడ్డు వద్ద పానీపూరి బండి నడిపించుకుంటున్నాడు. శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలుడి బంధువు అన్న లాల్‌రాం రావత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు గ్రామాల్లో చోరీలు

ధర్మారం(ధర్మపురి): రెండు గ్రామాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగిందని, ఈ ఘటనలో 6 తులాల బంగారు, 45 తులాల వెండి ఆభరణాలు, రూ.30వేల నగదు చోరీకి గురైందని ఎస్సై సత్యనారాయణ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బంజేరుపల్లి గ్రామానికి చెందిన కోరే మహేందర్ గొర్రెకాపరి. వాటిని మేపేందుకు బయటకు వెళ్లాడు. ఆయన భార్య సహస్ర ఇంట్లోనే ఉన్నారు. రాత్రి 12 గంటల సమయంలో గేట్ తీసుకుని ఇంట్లోకి దూరిన దొంగలు.. తులం బంగారు, 30 తులాల వెండినగలు, రూ.పదివేల నగదు ఎత్తుకపోయారు. అదేవిధంగా బంజేరుపల్లి తండా బి- గ్రామానికి చెందిన లావుడ్య రాంచందర్‌నాయక్ ఇంట్లోకి అదేరాత్రి గంట వ్యవధిలోనే చోరీకి పాల్పడిన దొంగలు.. 5 తులాల బంగారు, 15 తులాల వెండినగలు రూ.20 వేల నగదు ఎత్తుకపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ హోంగార్డు మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు తొగిటి రాధ (50) చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఈనెల 12న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్‌షాక్‌కు గురైంది. దీంతో ఆమెను వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. రాధ కూతురు రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

మానేరు తీరంలో గుర్తు తెలియని మృతదేహం

- చెట్టుకు ఉరివేసుకుని వృద్ధుడు మృతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రం మానేరునది తీరంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. మానేరునది ఒడ్డున చెట్టుకు ఉరివేసుకుని సుమారు 55 ఏళ్ల వృద్ధుడు మృతిచెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి ఒంటిపై గోధుమరంగు షర్టు, బూడిద రంగు ప్యాంట్, రబ్బరు చెప్పులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

కూతురు కళ్లెదుటే తండ్రి దుర్మరణం

- ద్విచక్రవాహనంపై వస్తుండగా ఢీకొన్న లారీ
- ఇంట్లో తీరని విషాదం



ద్యాగ లచ్చన్న (ఫైల్)

రాయికల్: తెల్లారితో ఆ ఇంట్లో మల్లన్న బోనాలు. సంతోషంగా గడుపుదామని భావించిన ఆ తండ్రి పెద్ద కూతురును పుట్టింటికి తీసుకొద్దామని బయల్దేరాడు. కూతురు, మనవరాళ్లతో ఇంటికి బయల్దేరాడు. అంతలోనే విధి వెక్కిరించింది. మరో పది నిమిషాల్లో ఇల్లు చేరుతారనగా.. లారీ మృత్యువు రూపంలో కబళించింది. కూతురు కళ్లెదుటే ఆ తండ్రి ప్రాణం గాలిలో కలిసిపోయింది. ఈ ఘటన రాయికల్ మండలం రామాజీపేటలో విషాదం నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ద్యాగ లచ్చన్న (55)కు ఇద్దరు కూతుళ్లు. ఇద్దరికీ పెళ్లి చేశాడు. ఆదివారం ఇంట్లో మల్లన్న బోనాలు చేసుకునేందుకు పెద్ద కూతురును తీసుకొద్దామని శనివారం ఇదే మండలం ఇటిక్యాల వెళ్లాడు. ఇద్దరు మనవరాళ్లు, కూతురును బైక్‌పై కూర్చోబెట్టుకుని తిరిగి ఇంటికి బయల్దేరాడు. రాయికల్ శివారులోకి రాగానే చెరుకు లోడ్‌తో ఎదురుగా వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో లచ్చన్న లారీ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. కూతురు కళ్లెదుటే తండ్రి దుర్మరణం పాలవడంతో కూతురు రోధనలు మిన్నంటాయి.

సగం ధరకే బంగారమట..!

- కర్ణాటక నుంచి పలువురికి ఫోన్లు
- వాట్సప్‌లో బంగారం ఫొటోలు



ఆగంతకులు పంపించిన నకిలీ బంగారం ఫొటోలు

జగిత్యాలక్రైం: సగం ధరకే బంగారం ఇస్తామంటూ కర్ణాటకకు చెందిన రెండు బృందాలు మూడు రోజులుగా జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్, హబ్సీపూర్, కల్లెడ, అనంతారం, ధర్మారం, లక్ష్మీపూర్ గ్రామాల్లోని పలువురికి ఫోన్లు చేస్తూ వల వేస్తున్నారు. బెంగళూరు సమీపంలో ఇంటినిర్మాణం చేస్తుండగా బంగారం బయట పడిందని, ఆ బంగారాన్ని సగం ధరకే విక్రయిస్తామని 82960 09383, 88670 24793 నంబర్ల నుంచి పలువురికి వాట్సాప్‌లో ఫొటోలు పంపిస్తున్నారు. అయితే కొందరు యువకులు బంగారాన్ని హైదరాబాద్‌కు తీసుకొస్తే తాము అక్కడకు వచ్చి డబ్బులు చెల్లించి తీసుకుంటామని నమ్మిస్తుండగా.. వారు మాత్రం కర్ణాటకకు వస్తేనే బంగారం ఇస్తామంటూ వల వేస్తున్నారు.

గతంలోనూ జగిత్యాలవాసి మోసం

సరిగ్గా పది నెలల క్రితం జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి సగం రేటుకే బంగారం ఇస్తామని నమ్మించాడు. వాట్సాప్‌లో బంగారం ఫొటోలు పంపించడంతో నమ్మిన సదరు వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లాకు వెళ్లాడు. కర్ణాటకకు చెందిన ఇద్దరు ఆగంతకులు వచ్చి ముందుగా సుమారు తులం ఒరిజినల్ బంగారు బిల్ల ఇచ్చారు. అది నిజమని తేలడంతో సదరు వ్యక్తి రూ.9లక్షలు వారికి అప్పగించాడు. దీనికి వారు అర కిలో నకిలీ బంగారాన్ని చేతిలో పెట్టారు. జగిత్యాలకు వచ్చి వాటిని పరిశీలించగా.. నకిలీవని తేలడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇప్పుడు కూడా అలాగే జిల్లాకు చెందిన పలువురికి సగం ధరకే బంగారం ఇస్తామని కర్ణాటకకు చెందిన ముఠా పలువురికి ఫోన్లు చేస్తూ నమ్మిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

సౌదీలో జగిత్యాల వాసి మృతి



సయ్యద్ రఫీయొద్దీన్ (ఫైల్)

జగిత్యాలక్రైం: ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఉస్మాన్‌పురకు చెందిన సయ్యద్ రఫీయొద్దీన్ (45) ఐదు నెలల క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. ఓ హోటల్‌లో పనికి కుదిరాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి గుండెపోటు రావడంతో తోటి ఉద్యోగులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సర్జరీ చేయాలన్నారు. స్నేహితులు కొందరు గుండె శస్త్రచికిత్స చేయించారు. అంతలోనే మరోసారి గుండెపోటు రావడంతో చనిపోయాడు. విషయాన్ని ఇక్కడి కుటుంబ సభ్యులకు చేరవేశారు. దీంతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. రఫీయొద్దీన్‌కు శనివారం రాత్రి అక్కడే అంత్యక్రియలు పూర్తి చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



జగిత్యాలరూరల్: కొడిమ్యాల మండలం పూడూరులో శనివారం తనిఖీలు చేయగా.. అదే గ్రామానికి చెందిన వారణాసి ప్రభాకర్ తన పాత ఇనుప సామాను దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన 73.80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయనపై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మల్యాల ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించామన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

జగిత్యాలక్రైం: అప్పుల బాధతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై సదాకర్ మాట్లాడుతూ.. మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన గౌతమికి కన్నాపూర్‌కు చెందిన మేరుగు గౌతమ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. కుటుంబ పోషణకు అప్పు చేయడంతో అవి పెరిగిపోయాయి. తల్లిదండ్రులు లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక అప్పు ఎలా తీర్చాలోనని మదనపడుతోంది. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గౌతమి (35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఆమె కూతుళ్లు, కుమారుడు చిన్నపిల్లలు కావడంతో కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి చిన్నబాపు కత్తి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

కరీంనగర్‌క్రైం: భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలం జూగుండ్ల గ్రామానికి చెందిన ఇరుకుల్ల భాస్కర్(40)కరీంనగర్‌లో భవన నిర్మాణ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కరీంనగర్ కట్టరాంపూర్‌లోని మహాలక్ష్మీనగర్‌లో శుక్రవారం భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గాయాలు కావడంతో తోటి కార్మికులు, స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తల్లి కనుకవ్వ ఫిర్యాదు మేరకూ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌లో ఇరుక్కున్న చీరకొంగు.. మహిళ మృతి

కరీంనగర్‌క్రైం: ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చీరకొంగు టైరులో ఇరుక్కొని మహిళ కిందపడి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్‌లోని రామచంద్రాపూర్‌లో చోటు చేసుకుంది. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ భల్లు నాయక్ తండాకు చెందిన భూక్య దస్రు- జుంక(40) దంపతులు. పని నిమిత్తం శనివారం బైక్‌పై కరీంనగర్ వస్తున్నారు. రాంచంద్రాపూర్‌కాలనీ వద్దకు చేరుకోగానే జుంక చీరకొంగు బైక్‌టైరులో ఇరుక్కుంది. ఆమె కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలి కొడుకు భూక్య శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.